

నీకు నేను.. నాకు నీవు రక్ష

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ. పండుగ సందర్భంగా జిల్లాలోని సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి అక్కా చెల్లెళ్లు పుట్టిళ్లకు చేరుకున్నారు. 8లో▸



గుడికే కన్నం వేశారు!

దోపిడీ దొంగలు ఏకంగా దేవుని గుడికే కన్నం వేశారు. గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.4 /26.3

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం ఒకటి రెండు చోట్ల చినుకులు పడతాయి.

గురువులకు గుడ్ న్యూస్



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు డీఈవో ఆఫీస్‌కు వచ్చిన ఉపాధ్యాయులు (ఫైల్)

- టీచర్ల బదిలీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్..
- మధ్యంతర స్టే ఎత్తివేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ఆరునెలలుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. మధ్యంతర స్టేను హైకోర్టు బుధవారం ఎత్తివేసింది. దీంతో బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 5లోని ఉపాధ్యాయ దంపతులకు ఇచ్చే అదనపు పది పాయింట్లను హైకోర్టు సమర్థించింది. అదే సమయంలో ఉపాధ్యాయ సంఘం నాయకులకు ఇచ్చే పది పాయింట్లను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈరెండు మార్పులతో బదిలీలకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. ఈమేరకు బదిలీల ఉత్తర్వులను సవరిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యభర్తలు కలిసి ఉండాలన్నది నిబంధన ఉద్దేశమని ధర్మాసనం స్పష్టం చేసింది. టీచర్ల బదిలీలు తుది తీర్పునకు లోబడి ఉండాలని హైకోర్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయవర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఇలా..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఆటంకాలు ఎదురవుతున్నాయి. భాషా పండితులు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలని దశలవారీ ఆందోళనలు చేశారు. 9, 10 తరగతుల బోధన నిలిపివేశారు. హైకోర్టుకు పోస్టుకార్డులు రాశారు. అయినా పండితుల సమస్య పరిష్కారం కాలేదు. మరోవైపు నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు బదిలీల ప్రక్రియపై మొదట మార్చి 7 వరకు స్టే విధించింది. పలుమార్లు వాయిదాలు పడ్డాయి. 317 జీవో ద్వారా కొత్త జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు పాత జిల్లాలోని పాఠశాలల్లో పనిచేసిన కాలాన్ని పరిగణలోకి తీసుకుని బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు ఆన్‌లైన్‌లో అర్జీలు స్వీకరించారు. 264 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన చేసి డీఈవో ఆమోదించారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్..

ఇదివరకే ఉపాధ్యాయులు బదిలీల కోసం జనవరి 28 నుంచి నుంచి ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవటంతోపాటు హార్డ్ కాపీలు సంబంధిత అధికారులకు అందజేశారు. 1,392 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 1,386 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేశారు. నలుగురు ఉపాధ్యాయులు నాట్ విల్లింగ్ ఉండగా ఇద్దరు అర్హత లేకున్నా దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో చేరిన తేదీ ఉద్యోగంలో చేరిన తేదీని నమోదు చేయటం ద్వారా ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయించి వాటి ఆధారంగా జా బితాలు సిద్ధం చేశారు. స్పౌజ్ ఉద్యోగులుగా ఉ న్న వారికి అదనంగా పాయింట్లు కేటాయించాల్సి ఉంది. ఎనిమిదేళ్ల కాలంలో అదనపు పా యింట్లను ఒకసారి మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది. మళ్లీ ఎనిమిదేళ్ల గడువు ముగిసిన తర్వాతనే మరోసారి ఉపయోగించుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులు, వితంతువులు, అవివాహిత మహిళలకు బదిలీల్లో ప్రాధాన్యత కల్పించారు. ఈనేపథ్యంలో బదిలీలపై పలువు రు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మార్చి 14 వరకు స్టే విధించటం, త రుచుగా వాయిదాలు పడుతూ వస్తోంది. బుధవారం బదిలీలకు హైకోర్టు అనుమతించింది.

అదనపు పాయింట్లతో ఆనందం



ఉపాధ్యాయ దంపతులకు పది అదనపు పాయింట్లు కేటాయిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వడం ఆనందంగా ఉంది. భార్య భర్తలు ఇద్దరూ ఒకే చోట లేదా దగ్గరదగ్గరగా పనిచేయాలని ప్రభుత్వం భావించి వారికి అదనంగా పది పాయింట్లు కేటాయించింది. ఈ విషయాన్ని కోర్టు కూడా సహృదయంతో అర్థం చేసుకుంది.

– ఆదిలక్ష్మి, ఉపాధ్యాయురాలు, పెద్దగోపాల్‌పూర్ ఎంపీపీఎస్

స్పౌజ్‌లకు పాయింట్స్ సంతోషకరం



అన్ని డిపార్ట్‌మెంట్లలో భార్య పనిచేసే చోటకి భర్తను, భర్త పనిచేసే చోటుకి భార్యను ప్రభుత్వం బదిలీ చేస్తూ వస్తుంది. ఉపాధ్యాయులకు కూడా వర్తిస్తుంది. స్పౌజ్ పాయింట్స్ వినియోగించుకునే టీచర్లు కచ్చితంగా తమ స్పౌజ్ వద్దకు బదిలీ అయితేనే అర్థం ఉంటుంది. గతంలో ఆన్‌లైన్ విధానంలో ఈ ఆప్షన్ లేదు. చివరకు పాయింట్స్ ఇవ్వడం సంతోషకరం.

– బన్న రవీందర్, టీయూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

స్టే ఎత్తివేత శుభ పరిణామం..



దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా న్యాయపరమైన చిక్కులు ఉండటంతో ఆరునెలలుగా ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. బుధవారం రాష్ట్ర హైకోర్టు స్టే ఎత్తివేయడం శుభ పరిణామం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నా బదిలీలు, పదోన్నతులకు మార్గం సుగమం అయింది. విద్యాశాఖ మళ్లీ సమస్యలు ఉత్పన్నం కాకుండా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి.

– డాక్టర్ పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, పీఆర్‌టీయూ

న్యూస్‌రీల్

జిల్లాకు రూ.206.10 కోట్లు మంజూరు

చెన్నూర్: జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జూన్ 30న ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాల జిల్లాలోని 311 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.10లక్షలు, ఏడు మున్సిపాలిటీలకు రూ.25లక్షల చొప్పున మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం బుధవారం జిల్లాకు రూ.206.10 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. మంజూరైన నిధులతో పాలకవర్గ సభ్యులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. వచ్చిన నిధులతో గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు అభివృద్ధి బాట పడుతాయన్నారు. జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల విడుదలపై ఎమ్మెల్యే హర్షం

మంచిర్యాలటౌన్: జిల్లా అభివృద్ధికి నిధులు విడుదల చేస్తూ సీఎం కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేయడంపై మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో మంచిర్యాల నియోజకవర్గంలోని మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట మున్సిపాలిటీలు, మూడు మండలాల పరిధిలోని 66 పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీస్



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌కు బుధవారం సమ్మె నోటీసు ఇచ్చారు. సెప్టెంబర్ 11 నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భానుమతి, సరస్వతి మాట్లాడుతూ తాము 45 ఏళ్లుగా పనిచేస్తున్నా కనీస వేతనం, ఉద్యోగభద్రత లేదని తెలిపారు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె నోటీస్ ఇచ్చినవారిలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధాబాయి, మహేశ్వరి, ప్రమీల, అనురాధ, సత్యవతి తదితరులు ఉన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

మంచిర్యాలఅర్బన్: అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినట్లుగా 13 వేలతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంచిర్యాల ఎస్సీ బాలుర వసతిగృహంలో బుధవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న బీఈడీ, డీఈడీ అభ్యర్థులను మోసం చేస్తూ 6 వేల ఖాళీలతో నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. టీవీయూవీ బాధ్యులు ఈశ్వర్, సాయిరాం, పవన్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధి 4వ వార్డులోని ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుధవారం జేసీబీతో కూల్చి వేయించారు. పట్టణంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. కూల్చివేతలో ఆర్ఐ మాంతయ్య, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నస్పూర్: తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ సమగ్ర సర్వ శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షురాలు భారతీదేవి, ప్రధాన కార్యదర్శి టి.రాజన్న కోరారు. సమీకృత కలెక్టరేట్ ఎదుట బుధవారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్ర పటానికి మహిళా ఉద్యోగులు రాఖీ కట్టారు. రక్త దాన శిబిరం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, నగేశ్, మూర్తి, శ్రీనివాస్, స్వప్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి కృషి చేయాలి

- జిల్లా న్యాయమూర్తి కె.ప్రభాకరరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

మంచిర్యాలక్రైం: కేసుల సత్వర పరిష్కారానికి నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లలో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.ప్రభాకరరావు సూచించారు. సెప్టెంబర్ 9న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌పై జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారుల, ఎక్సైజ్, బ్యాంకు, న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులతో మాట్లాడి ఇరు వర్గాలవారిని సమన్వయం చేసి రాజీ కుదర్చాలని సూచించారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు సహకరించాలని అన్నారు. సమావేశంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి, మొదటి అదనపు జుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.ఉపనిషద్వని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌ఉల్లం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తయ్య పాల్గొన్నారు.

సమ్మెను విరమించండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: తమను క్రమబద్ధీకరించాలని కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు వెంటనే సమ్మెను విరమింపచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలతో బుధవారం చర్చలు జరిపారు. సమస్యలను రాతపూర్వకంగా అందిస్తే, కలెక్టర్, రాష్ట్ర వైద్య సంచాలకుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇప్పటికే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఉన్నతాధికారులు సమస్యలపై దృష్టి సారించారని పేర్కొన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున సమ్మెను విరమించాలని కోరారు. సమ్మె కొనసాగిస్తే ప్రభుత్వం తగిన చర్యలను తీసుకుంటుందని

'చేతి' రాత మారేనా?

- హస్తం పార్టీలో అభ్యర్థుల వడపోత
- సర్వేల ఫలితాలే కీలకం
- ప్రత్యర్థిపై గెలిచే అవకాశాలే గీటు రాయి
- నియోజకవర్గానికి మూడు పేర్లు పరిశీలన
- త్వరలో అధిష్టానానికి షార్ట్ లిస్ట్



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హస్తం పార్టీలో టికెట్ల కోసం పోటీ నెలకొంది. అభ్యర్థులు నియోజకవర్గంలో పట్టు, అధికార పార్టీని ఎదుర్కొనే బలం, గుణ, గణాలు, 'థర్డ్ ఐ' సర్వే ఫలితాల ఆధారంగా వడపోత ప్రక్రియ సాగుతోంది. సర్వేల్లో కొందరికీ ఏమాత్రం ప్రజల్లో పట్టు లేనట్లు తేలిపోయింది. కొన్ని చోట్ల పార్టీలో బలమైన నాయకుడు లేకపోయినా పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరి చేతికి టికెట్ దక్కుతుందోనని చర్చసాగుతోంది.

చెన్నూరు బరిలో ఎవరో..

ఎస్సీ రిజర్వు స్థానమైన చెన్నూరు టికెట్ కోసం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మాజీ మంత్రి బోడ జనార్దన్‌తోపాటు నూకల రమేశ్, ఓయూ విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్, సీనియర్ నాయకుడు గోమాస శ్రీనివాస్, నేతకాని సంఘం నాయకుడు దుర్గం అశోక్, మహిళా కోటాలో మేకల రాధిక, డాక్టర్ డి.విద్యావర్ధిని దరఖాస్తు చేసుకోగా డాక్టర్ డి.శ్రీనివాస్, పొంగులేటి శ్రీనివాస్ అనుచరుడిగా ఉన్న డాక్టర్ రాజారమేశ్‌బాబుతోపాటు నాయకులు, సొతుకు సుదర్శన్, మేకల శంకర్, టి.రామ్‌చందర్, దుర్గం నరేశ్ దరఖాస్తు చేసుకున్నారు. టికెట్‌పై ఎవరి ధీమాలో వారు ఉన్నారు. సామాజిక వర్గాలవారీగా సమీకరణ లెక్కలు వేసుకుంటున్నారు. గాంధీ భవన్‌లో పైరవీలు చేసుకుంటున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను దీటుగా ఎదుర్కొనే నాయకుని కోసం సర్వేలు జరిగాయి. మెరుగ్గా ఉన్న ముగ్గురి పేర్లు పరిశీలనకు వెళ్లాయి.

ఖానాపూర్‌లో అధికంగా..

ఖానాపూర్ టికెట్ కోసం ఏకంగా 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌తోపాటు వెడ్మ బొజ్జు, చారులత రాథోడ్, భరత్ చౌహాన్, భూక్య చంద్రశేఖర్, భుక్యా నాయక్, రామ్‌కిషన్‌నాయక్, సునీల్ జాదవ్, కిశోర్ కుమార్, శ్రవణ్‌కుమార్, కొట్నాక రమేశ్, రాములునాయక్, బాపురావు, పెందోర్ ప్రభాకర్, వినోద్ కుమార్ నాయక్ ఉన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి దీటైన వారి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ అర్జీ వెళ్లడంతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే ఆమె ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో చేరలేదు. ఈ క్రమంలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ నెలకొంది.

మంచిర్యాలలో ఏడుగురు

మంచిర్యాల టికెట్ కోసం ఏడుగురు పోటీలో ఉన్నారు. ప్రధానంగా మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు, సీనియర్ నాయకులు కేవీ.ప్రతాప్ ఉన్నారు. వీరితోపాటు వంగల దయానంద్, శ్రీరాంభట్ల శరత్ కుమార్, ముత్తె సత్తయ్య, అక్కల తిరుపతివర్మ, డా.నీలకంఠేశ్వర్ కూడా దరఖాస్తు చేశారు. ఇక్కడి నుంచి ఇప్పటికే మూడు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ప్రేమ్‌సాగర్ వర్గం తమకే టికెట్ అని చెబుతుంటే, కేవీ.ప్రతాప్‌తోపాటు ఇతర బీసీ నాయకులు సైతం ఆశలు పెట్టుకున్నారు.

కవిత అనుచరుడు కూడా..

భారత జాగృతి న్యాయ సలహాదారు, ఎమ్మెల్సీ కవిత అనుచరుడిగా పేరున్న, దండేపల్లి మండలం వెల్గనూరుకు చెందిన అక్కల చంద్రమౌళివర్మ సైతం కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేయడం ఆసక్తి రేపుతోంది. మొన్నటిదాక ఆయన బీఆర్‌ఎస్‌లో బీసీ కోటాలో టికెట్ ఆశించారు. జాబ్ మేళా, యోగా పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావుకే మళ్లీ అవకాశం కల్పించడంతో చంద్రమౌళి కాంగ్రెస్‌కు దరఖాస్తు

బెల్లంపల్లి టికెట్ ఎవరికో..

బెల్లంపల్లిలో మాజీ మంత్రి గడ్డం వినోద్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా, చిలుమల శంకర్, కంపల్లి ఉదయ్‌కుమార్, దాసరి విజయ, నాతరి స్వామి, రొడ్డ శారద, గడ్డల హైమావతి, భవాని చొప్పదండి, ముడిమడుగుల మహేందర్, మోహన్ దుర్గం నేత దరఖాస్తు చేసుకున్నారు. వినోద్‌వర్గంతో పాటు నాతరి స్వామి, చిలుముల శంకర్ పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నారు. లోకల్, నాన్‌లోకల్ అంటూ వర్గాలుగా విడిపోయి ఉన్నాయి. జనాదరణ పొందిన వారు ఎవరనే కోణంలో సర్వేలు జరిగాయి. మరోవైపు కమ్యూనిస్టులతో పొత్తు ఉంటే ఈ సీటు అడిగితే అభ్యర్థులకు ఇబ్బందిగా మారనుంది. ఈ క్రమంలో బెల్లంపల్లి సీటు ఆసక్తి రేపుతోంది.

వేతన సవరణ చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్‌ఐసీ ఉద్యోగులు

పాతమంచిర్యాల: ఎల్‌ఐసీ యాజమాన్యం ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని ఎల్‌ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి చరణ్ మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. సంస్థ పురోగతికి సహకరిస్తున్న ఉద్యోగుల వేతన సవరణలో జాప్యం తగదన్నారు. ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం పెరుగుదల అమలు చేయాలని, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ఎల్‌ఐసీని ప్రభుత్వ రంగంలోనే ఉంచి బలోపేతం చేయాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 12 నుంచి సమ్మె చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ అధికారుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణ. అధికారుల సంఘం నాయకులు ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్, శ్రీధర్, ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, రంగరాజేశం, సంజీవయ్య, సుష్మ, గోపి, మల్లేశ్, శైలజ పాల్గొన్నారు.

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా శివకృష్ణ



విధుల్లో చేరిన శివకృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రో గ్రాం కోఆర్డినేటర్‌గా సీనియర్ శాస్త్రవేత్త కోట శివకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. శివకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ ప్రోగ్రాం కోఆరినేటర్‌గా పనిచేసిన ఎం.రాజేశ్వర్‌నాయక్‌ను వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ పరిధిలోని ఏఐసీఆర్‌పీ పశుగ్రాస విభాగం ప్రధాన శాస్త్రవేత్తగా బదిలీ చేశారు. నూతన కోఆర్డినేటర్ శివకృష్ణకు కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా సతీశ్



అధ్యక్షుడు సతీశ్

దండేపల్లి: వడ్డెర సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముద్దంగుల సతీశ్ నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు ధ్యారంగుల నగేష్, బుధవారం సతీశ్‌కు నియామక పత్రం అందించారు. వడ్డెర కులస్తుల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించడంతోపాటు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సతీశ్ తెలిపారు.

క్వార్టర్లలో భయం భయం!

- శిథిలావస్థలో 50 ఏళ్ల ఇళ్లు
- ఆందోళనలో కార్మిక కుటుంబాలు
- అధికారుల క్వార్టర్లదీ అదే పరిస్థితి
- కొత్త నిర్మాణాలకు సింగరేణి స్వస్తి?



ఆర్‌కేపీ గంగాకాలనీలోని షిర్కే క్వార్టర్లు

రామకృష్ణాపూర్: కోల్‌బెల్ట్ ప్రాంతమైన బెల్లంపల్లి రీజియన్‌లో కొత్త క్వార్టర్ల నిర్మాణానికి సింగరేణి స్వస్తి పలికినట్లు తెలుస్తోంది. ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. వాటిలోనే కార్మిక కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాయి. అధికారుల క్వార్టర్ల పరిస్థితీ అదే విధంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ క్వార్టర్ కూలుతుందో.. ఏ ప్రమాదం జరుగుతుందో అని కార్మిక కుటుంబాలు ప్రాణాలను అరచేతిలోపెట్టుకుని గడుపుతున్నారు. ఇటీవల రామకృష్ణాపూర్ పట్టణంలో బీ టైప్ క్వార్టర్ పైకప్పు కూలింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. భూపాలపల్లి, కొత్తగూడెం రీజియన్‌లో నూతన క్వార్టర్లు నిర్మిస్తున్న యాజమాన్యం. బెల్లంపల్లి రీజియన్‌పై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు.

రీజియన్‌లో 5 వేలకు పైగా కార్మికులు

బెల్లంపల్లి రీజియన్ పరిధిలో రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ పట్టణాలు ఉన్నాయి. కార్మికులు ఆయా పట్టణాల పరిధిలోని భూగర్భ గనులు, ఓసీపీల్లో సుమారు 5 వేలకుపైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా ఆయా పట్టణాల్లో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఏ టైప్, బీ టైప్, సీ టైప్, డీ టైప్, షిర్కే, నాగార్జున క్వార్టర్లలో నివాసముంటున్నారు. అడపా దడపా పాత క్వార్టర్లకు మరమ్మతులు చేయించడం మినహా కొత్త నిర్మాణాలపై యాజమాన్యం దృష్టిపెట్టడం లేదు. దీంతో పాత క్వార్టర్లు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. చాలా క్వార్టర్లలో కార్మికులు నివాసం ఉండడం లేదు. దీంతో ఖాళీగా ఉంటున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

నిర్మాణం లేనట్లే..

ఒకప్పుడు భూగర్భ గనులతో కళకళలాడిన బెల్లంపల్లి రీజియన్‌లో ప్రస్తుతం చాలా గనులు మూతపడ్డాయి. గతంలో 15 వేల వరకు కార్మికులు రీజియన్ పరిధిలోని గనుల్లో పనిచేసేవారు. గనులు క్రమంగా మూతపడడం, ఓసీపీల్లో తక్కువ మంది కార్మికులతో పనులు చేయిస్తుండడంతో కార్మికుల సంఖ్య ఐదారు వేలకు తగ్గిపోయింది. దీంతో కార్మికుల క్వార్టర్లను యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మరమ్మతులు కూడా సరిగా చేయించడం లేదు. దీంతో క్వార్టర్లలో ఉంటున్న కార్మికులు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో కొత్త క్వార్టర్లు నిర్మించే అవకాశం లేదని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఒకే కుటుంబం..ఒకే గమ్యం అన్న నినాదంతో ముందుకుపోతున్న సంస్థ బెల్లంపల్లి రీజియన్‌లోని కార్మికుల రక్షణపై వివక్ష చూపుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మరమ్మతులు చేయించాలని..

సంస్థకు చెందిన పలు క్వార్టర్ల పైకప్పులు కూలుతున్నందున కనీసం వాటికి పటిష్ట మరమ్మతులు అయినా చేయించాలని కార్మికులు, అధికారులు కోరుతున్నారు. మరమ్మతు కోసం దరఖాస్తు పెట్టుకున్నా.. నెలల తరబడి దరఖాస్తుకు మోక్షం కలగడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి భయం భ యంగానే కాలం గడుపుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి పాత క్వార్టర్లకు మరమ్మతులు చేయించాలని కార్మికులు కోరుతున్నారు.



ఆర్‌కేపీలోబీ టైప్ క్వార్టర్‌లో ఇటీవల కూలిన పైకప్పు

'డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి'

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణిలో డిస్మిస్ అయిన కార్మికులందరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిస్మిస్ కార్మికసంఘం అధ్యక్షుడు రవీందర్ డిమాండ్ చేశారు. బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గోదావరిలోయ బొగ్గుగని కార్మికసంఘం నాయకులు మేకల పోచమల్లు, జీ.రాములు, రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

రక్షణపై కార్మికులకు అవగాహన



మాట్లాడుతున్న అధికారి

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీలో బుధవారం కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. పనిస్థలాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండటం ద్వారానే ప్రమాదాలబారిన పడకుండా ఉంటామని, రక్షణ సూత్రాలను తప్పకుండా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎం గుప్తా, సిమ్‌టర్స్ మేనేజర్ విజయ్‌కుమార్, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, సేఫ్టీ ఆఫీసర్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు అకాల మృతి



మల్లయ్య (ఫైల్)

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) సీనియర్ నాయకుడు పుల్లూరి మల్లయ్య (66) మంగళవారం రాత్రి అకాల మృతి చెందాడు. 30 ఏళ్ల పాటు సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యుడిగా, ఏఐటీయూసీ ఏరియా ఆస్పత్రి పిట్ సెక్రెటరీగా పనిచేశారు. ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారు. బుధవారం మృతదేహానికి సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, నాయకులు చిప్పన ర్సయ్య, ఎం.వెంకటస్వామి, దాగం మల్లేశ్, ఆడెపు రాజమౌళి, అక్కెపల్లి బాపు, బి.లక్ష్మీనారాయణ, ఉపేందర్, ఎల్తూరి శంకర్, బి.వెంకటస్వామి, రత్నం రాజం, బి.రాంచందర్, మహేందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాంనాథ్ నివాళులర్పించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. జగిత్యాల జిల్లాకు చెందిన మనోహర్‌రావు, సుమతి, శైలజ, రమాదేవి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని నుంచి ఇందారం మీదుగా మంచిర్యాలకు వెళ్తుండగా ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై కారు అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.









నీకు నేను.. నాకు నీవు రక్ష

- సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు
- అనుబంధాలను బలోపేతం చేస్తున్న రక్షా బంధన్
- అభిప్రాయాలను పంచుకున్న సోదరీమణులు

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ. ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరి తన సోదరుడు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎల్లప్పుడూ అన్నకు అండగా ఉంటానని చెప్తుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న తరుణంలో రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర సోదరీమణుల మధ్య ఉండే అనుబంధానికి, ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగుదలకు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధాలకు, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రక్షాబంధనం నిలుస్తుంది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలోని సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కా చెల్లెళ్లు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

ఏటా వచ్చి రాఖీ కడుతా



బెల్లంపల్లి : చిన్నతనంలో తోబుట్టువులతో కలిసి ఉండి పెళ్లై అత్తారింటికి వెళ్లాక ఎడబాటు వస్తుంది. అన్నదమ్ములు గుర్తుకు వచ్చినప్పుడల్లా పుట్టింటికి రాలేం. కానీ రాఖీ పండుగకు మాత్రం జన్నారం మండలం ఇందన్‌పల్లి నుండి తప్పక వచ్చి అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టి దీవెనలు తీసుకుంటా.

– ఆదిమూలపు లక్ష్మి, ఇందన్‌పల్లి

కొత్త ఉత్సాహం..



బెల్లంపల్లి: రాఖీ పండుగ కొత్త ఉత్సాహం నింపుతుంది. ఈ పండుగ కోసం ఏడాది పాటు ఎదురు చూస్తుంటా. ఎక్కడెక్కడో స్థిరపడిన అక్కాచెల్లెళ్లు రాఖీపౌర్ణమికి కచ్చితంగా కలుసుకుంటారు. ఎన్ని పనులున్నా హైదరాబాద్ నుండి తాండూర్ మండలంలోని మాదారం వచ్చి రాఖీ కడుతా.

– గుండా అక్షర, హైదరాబాద్

15 సంవత్సరాలుగా రాఖీ కడుతున్న



జన్నారం: మాది కవ్వాల్. మా పుట్టిళ్లు జగిత్యాల జిల్లా సంగంపల్లి. పదిహేనేళ్లుగా ఏటా రాఖీ పండుగ రోజున పుట్టింటికి వెళ్లి రాఖీ కడుతున్నా. ఈ సంవత్సరం రెండు రోజులు ముందుగానే వెళ్లి రాఖీ కట్టా.

– లక్ష్మి, కవ్వాల్

ముంబయి నుంచి ...



కోటపల్లి: రాఖీ పండుగ అంటే నాకు చాలా ఇష్టం. మా ఆయన వృత్తిరీత్యా ముంబయిలో ఉంటున్నాం. నాకు ముగ్గురు అన్నదమ్ములు. పండుగకు ముందురోజే ముంబాయి నుంచి కోటపల్లికి వస్తాం. రాఖీ పండుగకు అందరం కలుసుకోవడం ఆనందంగా ఉంటుంది.

– భవాని, ముంబయి

యూకే నుంచి వచ్చా



చెన్నూర్‌రూరల్: నా భర్త ఉద్యోగరీత్యా యూకేలో స్థిరపడ్డాం. మా పుట్టిళ్లు మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం పొక్కూరు. నాకు వివాహమైనప్పటి నుంచి ఏటా పదిరోజుల ముందే మా అన్నయ్యలకు రాఖీలు పంపించేది. ఈసారి రాఖీ కట్టేందుకు వచ్చా. రాఖీ పౌర్ణమిని ఎంతో ఆనందంగా జరుపుకుంటాం.

– చల్ల అనూష, యూకే

రాఖీ పండుగకు తప్పకుండా వస్తా



దండేపల్లి: మా పుట్టిళ్లు దండేపల్లి మండలం చింతపల్లి. నా భర్త హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండడంతో అక్కడే ఉంటున్నాం. ఏటా రాఖీ పండుగకు చింతపల్లికి వచ్చి నా సోదరుడు అమరేందర్‌కు రాఖీ కడుతా. రాఖీ పండగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాం.

– మౌనిక, చింతపల్లి

అన్నకు ముద్దుల చెల్లిని



చెన్నూర్: నేను మా అన్నకు ముద్దుల చెల్లిని. ఉన్నత చదువులరీత్యా ఏడేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నా. ఏటా రాఖీపౌర్ణమికి చెన్నూర్‌కు వచ్చి అన్నయ్యకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటా.

– సద్దనపు సాయికృపా, హైదరాబాద్

ఎదురుచూస్తుంటాం



ఆసిఫాబాద్‌అర్బన్: మా పుట్టిళ్లు ఆసిఫాబాద్. ఏటా రాఖీ పౌర్ణమికి వరంగల్ నుంచి వచ్చి మా అన్నయ్యకు రాఖీ కడుతా. ఇలా రాఖీ కట్టడం వలన మాఅన్నయ్యకు ఏడాదంతా మంచి జరుగుతుందని నమ్మకం. అమ్మానాన్నలతో కలిసి పండుగ జరుపుకుంటాం. అమ్మ చేతి వంటలను ఆస్వాదిస్తాం.

– తాటిపల్లి ఈశ్వర్, శ్రేష్ఠ, అన్నా చెల్లెలు, వరంగల్

హైదరాబాద్ నుంచి వచ్చా



కౌటాల: రాఖీ పండగ సందర్భంగా మా అన్నకు రాఖీ కట్టడానికి హైదరాబాద్ నుంచి కౌటాలకు వచ్చా. నా పెళ్లి అయిన తర్వాత మొదటి పండుగ కావడంతో మా ఆయనతో కలిసి వచ్చా. ఈ పండుగ నాకు ఎంతో ప్రత్యేకమైనది. కుటుంబ సభ్యులందరం కలిసి పండుగ జరుపుకుంటాం.

– అనూష, హైదరాబాద్

ఆత్మీయ పండుగ



మా తల్లిదండ్రులకు ఇద్దరం ఆడపిల్లలం. ఏటా గుడ్లబోరిలో ఉన్న మా పెద్దనాన్న కుమారుడు డొంగ్రె దినకర్‌కు రాఖీ కడుతున్నా. మా వయస్సు పెరిగినా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధం మర్చిపోం. మాకు సోదరులు లేనిలోటును మా అన్నయ్య తీరుస్తున్నారు. ఈ పండగంటే చాలా ఇష్టం.

– కె.సోమబాయి, రాస్పెల్లి

గుడికే కన్నం వేశారు!

- గూడెం సత్యదేవుడి ఆలయంలో చోరీ
- అమ్మవారి నగలు, హుండీ డబ్బులు అపహరణ



ఈవో, సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ

దండేపల్లి(మంచిర్యాల): దోపిడీ దొంగలు ఏకంగా దేవుని గుడికే కన్నం వేశారు. మంచిర్యాల జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీకి పాల్పడ్డారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు, ఆలయ అధికారులు పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ముసుగులు ధరించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం ఆలయ సిబ్బంది సత్తయ్య గుట్టపైకి వెళ్లి చూడగా సీసీ కెమెరాలు తిప్పి ఉండటంతో పాటు ఒక కెమెరా పగిలి ఉంది. పైగా ఆలయ గేటు తాళాలు పగులగొట్టి హుండి బయట పడేసి ఉన్నాయి. ఆలయ ఈవో శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లక్సెట్టిపేట సీఐ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్ ఘటనాస్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

నగలు, హుండీ డబ్బులు అపహరణ

ఇనుప రాడ్లతో ఆలయ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ప్రధాన ఆలయం వద్ద ఉన్న నాలుగు హుండీలలో ఒకదానిని పగులగొట్టి సుమారు రూ.5వేల నుంచి రూ.7వేల వరకు నగదును, గర్భగుడి తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న 8 గ్రాముల మంగళ సూత్రాన్ని దొంగిలించారు. ఆపహరణకు గురైన సొత్తు విలువ మొత్తం రూ.30వేల వరకు ఉంటుందని ఆలయ ఈవో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొరం తవ్వకాలను అడ్డుకున్న అధికారులు



తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్‌ఐ సమ్మక్క

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని శిల్వగుట్ట వద్ద జరుగుతున్న మొరం అక్రమ తవ్వకాలను మంగళవారం సాయంత్రం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి పక్కా భవనం నిర్మాణానికి శిల్వగుట్ట వద్ద నుంచి అధికార పార్టీ నాయకులు మొరం తరలించడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వాహనాలను నిలిపివేసి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్‌ఐ సమ్మక్క సంఘటన స్థలానికి చేరుకుని వాహనాలను ఆపాలని చెప్పడంతో ట్రాక్టర్ యజమానులు రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్ అక్కడికి రావడంతో ఇరుపార్టీలకు మధ్య జరిగిన గొడవలో ఆయన చేతికి గాయాలయ్యాయి. పోలీసులు రావడంతో అంతా అక్కడినుంచి వెళ్లిపోయారు. బుధవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు మూడు ట్రాక్టర్లు, జేసీబీని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. గొడవపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాఖీ వేడుకలు



ఎమ్మెల్యే చేతికి రాఖీ కడుతున్న కౌన్సిలర్లు

బెల్లంపల్లి: రాఖీ పండుగను పురస్కరించుకుని బుధవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఏఎంసీ ఏరియాలో ఉన్న క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే చిన్నయ్య, ఆయన సతీమణి జయతారకు మహిళ ప్రజాప్రతినిధులు హారతి ఇచ్చి ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టి ఆత్మీయతను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ముస్లిం మహిళ కౌన్సిలర్ ఆస్మాబేగం చిన్నయ్యకు రాఖీ కట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, మున్సిపల్ మహిళ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టణంలో కనీస వసతులు కరువు



డ్రైనేజీని చూపుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 11వ వార్డు గొల్లవాడలో బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ఆరెందుల నివాస్, శివ, ముదాం మల్లేశ్, రాకేశ్, అశోక్, సత్యనారాయణ, దీపక్ పాల్గొన్నారు.

గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశు గణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలో కుభీర్ మండలంలోని మర్లగొండ, భైంసా మండలం వానల్‌పహాడ్, బాసర మండలం కౌట, మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలంలోని దేవులవాడ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయి గూడ, లింగాపూర్ మండలంలోని ఫట్‌కల్‌మంగి, రెబ్బెన మండలంలోని గోలేటిలో ఖాళీగా ఉన్నట్లుగా తెలిపారు. వీటికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. అలాంటి వారు ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణ పత్రం(ఆధార్ లేదా రేషన్‌కార్డు) ఫొటోతో తమ దరఖాస్తులను సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న అక్బర్‌అలీ

రామకృష్ణాపూర్(చెన్నూర్): 11వ వేజ్‌బోర్డు తాలూకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి అక్బర్‌అలీ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియర్స్‌పై కోలిండియా నుంచి సర్క్యులర్ వచ్చినప్పటికీ ఇంకా చెల్లించకపోవడం సరికాదన్నారు. సంస్థకు వచ్చిన లాభాలనుండి వాటా కూడా ప్రకటించాలన్నారు. సెప్టెంబర్ 1న జీఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాకు కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, సంపత్, వెంకట్‌రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీఎన్జీవోస్ సొసైటీ స్థల సర్వే

- ఆందోళనతో స్పృహతప్పిన బాధితుడు
- ఆస్పత్రికి తరలింపు



స్పృహతప్పి పడిపోయిన నర్సయ్య

నస్పూర్(మంచిర్యాల): పట్టణంలో చేపట్టిన టీఎన్జీవోస్ సొసైటీ స్థలం సర్వే కొనసాగుతోంది. సంబంధిత అధికారులు బుధవారం తమ స్థలంలో సర్వే చేస్తుండగా ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందిన కనుమల్ల నర్సయ్య అనే వ్యక్తి స్పృహతప్పి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై నర్సయ్య కుమారుడు రాణాప్రతాప్‌ని 'సాక్షి' సంప్రదించగా మానాన్న పేరుమీద నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లో ఎకరం 16 గుంటల భూమి ఉందన్నారు. ఆభూమిలో అధికారులు సర్వే చేస్తున్నారని తెలియడంతో మానాన్నతో కలిసి అక్కడికి వెళ్లామన్నారు. ఈ భూమి కేసు కోర్టు పరిధిలో ఉందని, అలాంటప్పుడు మీరు సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించడంతో అక్కడే ఉన్న టీఎన్జీవో నాయకులు కొందరు నీకు ఇక్కడ ఎలాంటి భూమి లేదు.. నీవు ఇక్కడి నుండి పొమ్మని మా నాన్నతో వాగ్వాదానికి దిగడంతో ఆందోళన చెంది స్పృహతప్పి పడిపోయాడన్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు హార్ట్‌స్ట్రోక్ వచ్చిందని నిర్ధారించినట్లు ఆయన పేర్కొన్నారు.

వికసించిన రాఖీ పుష్పాలు



నెన్నెల: మండల కేంద్రంలోని గొల్లవాడలో దూపం చందు ఇంటిముందున్న చెట్లకు రాఖీ పుష్పాలు వికసించాయి. వీటిని పంచపాండవుల పుష్పాలు అని కూడా అంటారని స్థానికులు పేర్కొంటున్నారు. రాఖీని పోలినట్లు ఉన్న ఈ పుష్పంలో చుట్టూ నీలిరంగు రేకులు 101 ఉండగా మధ్యలో తెల్లటి వర్ణంలో ఉండే కేశనాలికలు ఐదు ఉన్నాయి. వీటిని పంచపాండవులుగా భావిస్తారని చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ జాబ్ గ్యారంటీ 18–50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం, జీతం: 25000/-వేల వరకు. ఫోన్ : 9966310431 [HA-10956]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462